క్లుప్తంగా

పంటల పరిశీలన



పంటలు పరిశీలిస్తున్న డీఏవో కల్పన

కాసిపేట: మండలంలోని సోనాపూర్ శివారులో వ్యవసాయశాఖ ఎంపిక చేసిన సర్వే నంబర్లలో రైతులు వేసిన యాసంగి పంటలు శనగ, జొన్న, మిరప పంటలను శనివారం జిల్లా వ్యవసాయశాఖాధికారిణి కల్పన పరిశీలించారు. పంటల సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులను రైతులకు తెలియజేశారు. రైతులకు ఎటువంటి అనుమానాలు ఉన్నా, సంబంధిత వ్యవసాయశాఖాధికారులను కలిసి నివృత్తి చేసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఏఈవో అంజలి, రైతులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయాలి

శ్రీరాంపూర్: దేశవ్యాప్తంగా ఈ నెల 16న జరిగే సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ కోల్‌ట్రాన్స్‌పోర్టు, కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల దాసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సమ్మె జరుగుతుందన్నారు. ప్రభుత్వాలు కార్మిక వర్గ హక్కులను పెట్టుబడిదారులకు తాకట్టు పెడుతున్నాయన్నారు. కొత్త చట్టాలతో కార్మిక హక్కులను కాలరాస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న శ్రమ దోపిడీకి నిరసనగా కార్మికులందరూ ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన సూచించారు.

రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

కాసిపేట: తెలంగాణ ప్రభుత్వం సేవాలాల్ జయంతిని ఫిబ్రవరి 15న సెలవు దినంగా అధికారికంగా ప్రకటించినందునా శనివారం మండలంలోని కొండపూర్‌యాపలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సేవాలాల్ సేన ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో కార్మికసంఘం నాయకుడు సత్యపాల్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వేముల కృష్ణ, సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాదవ్ గజానంద్ నాయక్, నాయకులు ఆజ్మీర తిరుపతి నాయక్, మాజీ సర్పంచ్ భుక్య రవి, ఎంపీటీసీ పార్వతి మల్లేష్, ఆజ్మీర దేవిసింగ్, బానోత్ భీమానాయక్ తదితరులున్నారు.

జాతర వద్ద దుకాణాల ఏర్పాటుకు టెండర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని ఆర్కే–1ఏ సమీపంలో సింగరేణి ఆధ్వర్యంలో 21నుంచి 23వరకు ఏర్పాటు చేసే సమ్మక్క–సారలమ్మ జాతర వద్ద దుకాణాల ఏర్పాటు కోసం ఈ నెల 15న వేలం కోసం టెండర్ నిర్వహించనున్నట్లు ఏరియా సమ్మక్క సారలమ్మజాతర కమిటీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. దుకాణాల ఏర్పాటు కోసం ఆసక్తి గలవారు ఈ నెల 15న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో ఉదయం 10గంటలకు నిర్వహించే వేలం టెండర్లో పాల్గొనాలని కమిటీ తెలిపింది. చిన్న దుకాణాలు పెట్టుకోవడానికి రూ.వేయి చెల్లించాల్సి ఉంటుందని కమిటీ పేర్కొంది.

అనాథ పిల్లలకు క్రీడా సామగ్రి ఇవ్వాలని వినతి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీనగర్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథాశ్రమంలోని పిల్లలకు వ్యాయామంతో పాటు, క్రీడల్లో రాణించేందుకు అవసరమైన క్రీడా సామగ్రి అందించాలని కోరుతూ రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ చందూరి మహేందర్ శ్రీరాంపూర్ సింగరేణి జీఎం సంజీవరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అనాథ పిల్లలకు అవసరమైన క్రీడాసామగ్రిని ఇచ్చేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పీవీకి భారతరత్నపై హర్షం



నివాళులర్పిస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించటంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశాన్ని ప్రగతిబాటలో నడిపించిన మేధావి పీవీ అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు దుర్గం అశోక్, అక్కల రమేష్, మాసు సత్యనారాయణ, వైద్య శ్రీనివాస్, కుమ్మరి మల్లయ్య పాల్గొన్నారు.

పన్ను ఎగనామం..!

- ప్రభావిత పల్లెలకు పన్ను చెల్లించని 'ఓరియంట్'
- ఒక ప్లాంటుకు అనుమతి.. మూడు ప్లాంట్ల నిర్మాణం..
- 24 ఏళ్లుగా పెంపునకు నోచుకోని వైనం
- సిమెంటు కంపెనీ తీరుపై గుర్రుగా పంచాయతీలు



ఓరియంట్ సిమెంట్ కంపెనీ

కాసిపేట: పరిసర గ్రామాల అభివృద్ధి, ఆదివాసీల సంక్షేమం మాట ఎలా ఉన్న ఓరియంట్ సిమెంట్ కంపెనీ యాజమాన్యం చట్టపరంగా గ్రామపంచాయతీకి కట్టాల్సిన కోట్ల రూపాయల పన్నులు పథకం ప్రకారం తప్పించుకుంటూ రావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించుకునే కంపెనీ దొల్లతనంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 1979లో పనులు ప్రారంభించిన కంపెనీ 1983లో ఉత్పత్తి ప్రారంభించి అతిపెద్ద కంపెనీగా అవతరించింది. మూడువేల టన్నుల సిమెంట్ ఉత్పత్తి లక్ష్యంతో మొదటి ప్లాంటు ప్రారంభించి, ఐదువేల లక్ష్యంతో రెండో ప్లాంటు, 12వేల టన్నుల లక్ష్యంతో మూడో ప్లాంటును ప్రారంభించింది. ప్రస్తుతం 20వేల టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా నాలుగో ప్లాంటును ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకుంటుంది. విద్యుత్ ప్లాంటునూ సొంతంగా ఏర్పాటు చేసుకుంది.

పన్నులు చెల్లించడంలో మాత్రం పన్నాగాలు..

దినదినం అభివృద్ధి చెందుతూ వచ్చిన కంపెనీ గ్రామపంచాయతీకి చెల్లించిన పన్నుల్లో మాత్రం అతితెలివి ప్రదర్శిస్తూ వచ్చింది. గ్రామాల్లో చిన్న గుడిసె ఉన్నా ఇంటిపన్ను మాత్రం ప్రతి ఏటా పెంచుతూ వస్తారు. ఈ క్రమంలో కంపెనీ మాత్రం మొదటి నిర్మాణాలకు వేసిన పన్నులు మాత్రం చెల్లిస్తూ కా లం గడుపుతూ వచ్చింది. అంతేకాకుండా 5శాతం పెంపుదలలో మెళికలు పెడుతూ గ్రా మాల అభివృద్ధిని తొక్కి పెట్టింది. ఈ క్రమంలో ప్రస్తుతం టీఎస్ఎండీసీ హైదరాబాద్, టీఎస్‌పీసీబీ నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో 588.26హెక్టార్ల మైనింగ్ లీజుకు ఈ నెల 15న ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు చేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుత ఏడాదికి రూ.26లక్షల టాక్స్ చెల్లింపు...

ఈ ఏడాది గ్రామపంచాయతీ తిరస్కరించినా, రిజిస్టర్ పోస్టు ద్వారా గతనెల రూ.26లక్షల టాక్స్ చెక్కును పంపించడం వివాదస్పదంగా మారింది. సుమారుగా గ్రామపంచాయతీ రికార్డు ప్రకారం 1999–2000ఆర్థిక సంవత్సరం కంపెనీ చెల్లించిన లెక్కల ప్రకారం 2000సంవత్సరంలో రూ.13లక్షల 31వేలు టాక్స్ చెల్లించింది. ఏటా 5శాతం వృద్ధితో రూ.42లక్షల 83వేలు చెల్లించాల్సి ఉంది. అదనపు నిర్మాణాల టాక్స్ అంచనాలే లేవు. మొదటి ప్లాంటు పాత నిర్మాణాల అంచనాలే ఈ విధంగా ఉండగా, కోటిన్నరకు పైగా జీపీకి నష్టం చేసింది. ప్రస్తుతం గ్రామపంచాయతీ నుంచి టాక్స్ పెంచుతూ నోటీసులు పంపించడంతో పై స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులను మచ్చిక చేసుకొని బెదిరింపులకు పాల్పడుతుందనే విమర్శలున్నాయి.

నూతన కట్టడాలకు అనుమతులే లేవు..

కంపెనీ గ్రామపంచాయతీ పెంచిన టాక్స్ ప్రకారం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నా, ఇరవై ఏళ్లుగా చేపట్టిన నూతన ప్లాంట్లు, నిర్మాణాలకు గ్రామపంచాయతీ అనుమతులు లేవు. దీంతో వాటి అనుమతులు, టాక్స్‌ల అంచనాలు వేస్తే గ్రామపంచాయతీకి రూ.25కోట్లకు పైగా టాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అనుమతులు లేకుండా నిర్మించిన విషయం ఒప్పుకోవాల్సిందేనని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయమై ప్రశ్నించిన పాలకవర్గాలను మచ్చిక చేసుకోవడమో లేదా కలెక్టర్, మంత్రులతో మాట్లాడుతామని మీకు సంబంధం లేదని ఏమైనా ఉంటే మా లాయర్లు చూసుకుంటారు అనే సమాధానాలతో గ్రామపంచాయతీని చిన్నచూపు చూస్తున్నారు. వేల కోట్ల రూపాయలతో విస్తరించి స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా మాటలతో కాలం గడుపుతున్న కంపెనీ విషయంలో ఆదివాసీలు ఎప్పుడు పోరాడినా, అణిచివేయడం మినహా 40ఏళ్లలో మాకు న్యాయం జరిగింది లేదని వాపోతున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకున్నట్లయితే టాక్స్‌లతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- వాహనదారులకు అవగాహన కల్పించిన బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య, ఎంవీఐ గుర్రం వివేకానంద్
- ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచన



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ వివేకానంద్‌రెడ్డి

బెల్లంపల్లి: ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య అన్నారు. బెల్లంపల్లి కాంటా చౌరస్తా వద్ద శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత వాహనదారులపై ఉందన్నారు. ముఖ్యంగా వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. సంబంధిత వాహనంపై విధిగా నంబర్ ప్లేట్ ఉండటంతో పాటు వాహన నంబర్‌ను రాయించుకుని ఉండాలని వివరించారు. ట్రాఫిక్ నియమాలు అనుసరించడం వల్ల రోడ్డు ప్రమాదాలను నివారించడానికి వీలు కలుగుతుందని తెలిపారు. సరైన పత్రాలు లేకున్నా, వాహనంపై నంబర్ ప్లేట్ లేకున్నా చట్టరిత్య కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనం నడపొద్దని, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్య, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, పలువురు ఎస్సైలు, ఏఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు భద్రత అందరి బాధ్యత అని గుర్తుచేస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని సీనియర్ మోటార్ వెహికిల్ ఇన్స్‌స్పెక్టర్ గుర్రం వివేకానంద్‌రెడ్డి అన్నారు. హాజీపూర్ మండలం వేంపల్లిలోని జిల్లా రవాణా శాఖా కార్యాలయంలో శనివారం రోడ్డు భద్రతా మాసోత్సవాలపై వాహనదారులకు, వాహన చోదకులకు అవగాహన కల్పించారు. అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ ధరించడం, చిన్నారులకు వాహనాలకు ఇవ్వకుండా నియంత్రించడం, ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ చైతన్యం కావాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపడం, హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు చాలా జరుగుతున్నాయని, ముఖ్యంగా యువత ఈ ప్రమాదాల బారిన పడుతూ కుటుంబాలకు మానసిక క్షోభను మిగులుస్తున్నారన్నారు. రవాణాశాఖ చేపట్టే వాహన తనిఖీల్లో నిబంధనలు అతిక్రమించినట్లు తేలితే భారీ జరిమానాలతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వాహనదారులు, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన



మాట్లాడుతున్న సీడీపీవో ఉమాదేవి

బెల్లంపల్లిరూరల్: గ్రామాల్లోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఐసీడీఎస్ సేవలను సద్వినియోగించుకునేలా అంగన్‌వాడీలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సీడీపీవో ఉమాదేవి అన్నారు. మండలంలోని గురిజాల రైతువేదికలో పలు అంశాలపై శనివారం అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లబ్ధిదారులు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేలా చూడాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు అందించాలని సూచించారు. చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంతో పాటు విద్యను బోధించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈసీసీఈ యాప్, ఎన్‌హెచ్‌టీఎస్‌పై అవగాహన కల్పించి గ్రోత్ మిషన్స్ అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జాతర పనులు త్వరగా పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య

మంచిర్యాలటౌన్: పట్టణంలోని గోదావరి నది ఒడ్డున నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్ల పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య అధికారులను ఆదేశించారు. ప్రత్యేక నిధులతో చేసే శాశ్వత ఏర్పాట్లుగా మరుగుదొడ్ల నిర్మాణం, గద్దెల వద్ద ప్లాట్‌ఫాం నిర్మాణ కార్యక్రమాల పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, కౌన్సిలర్ వంగపల్లి అనిత, సుంకరి శ్వేత, జాతర కమిటీ నాయకులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి కృషి చేయాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ నూతన చైర్మన్‌గా ఎన్నికైన రావుల ఉప్పలయ్యను శనివారం మున్సిపల్ కార్యాలయంలో కలిసిన స్వచ్ఛంద పౌర సేవా సంస్థ సభ్యులు ఘనంగా సన్మానించి, పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా తులా మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. పట్టణంలో అభివృద్ధి గాడి తప్పిందని, అభివృద్ధి ముసుగులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, వాటిపై విచారణ చేపట్టాలని కోరారు. పట్టణంలోని చెరువుల పరిస్థితి అధ్వానంగా ఉందని, కొత్త డంపింగ్ యార్డు ఏర్పాటుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుని, ఆండాలమ్మ పరిసర ప్రాంత ప్రజలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో కనుకుంట్ల మల్లయ్య, రాదేశ్యామ్, ప్రదీప్, నల్ల నాగేందర్, రావికంటి శ్రీనివాస్, వీరస్వామి, చంద్రయ్య, దాస్య నాయక్, ఏలువాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెంచిన వేతనాలను చెల్లించేలా చూడాలి

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు రూ.వెయ్యి వేతనాన్ని పెంచుతూ జీవో జారీ చేసిందని, దానిని మంచిర్యాల మున్సిపాలిటీలో అమలు చేసేలా తీర్మానం చేసి, పెరిగిన వేతనాన్ని కార్మికులకు ఇవ్వాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సంఘం నాయకులు మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులుగా పనిచేస్తున్న వారిలో వయస్సు పైబడిన వారి పిల్లలను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, నాయకులు ఉప్పులేటి రామస్వామి, లింగయ్య, ఆత్మకూరి తిరుపతి, ఆవుల శ్రీనివాస్, ఆవునూరి సుధాకర్, రాజు, రవి, కుమారస్వామి, నవీన్ పాల్గొన్నారు.

మందమర్రిలో కార్డన్ సెర్చ్



మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని ఒర్రెగడ్డ ఏరియాలో శనివారం మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులను ఆపి తనిఖీలు చేపట్టారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని రెండు ఆటోలు, పలు ద్విచక్రవాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి ఏరియాలో ఖచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని, వాహన చోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, ఎవరైనా కొత్త వ్యక్తులు ఏరియాలో సంచరించినట్లు అనుమానం వస్తే పోలీస్‌స్టేషకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో మందమర్రి ఎస్సై చంద్రకుమార్, రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్, కాసిపేట ఎస్సై గంగారం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆటో డ్రైవర్లకు ఉచిత బీమా అందజేత

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఆటో డ్రైవర్లకు ఉచిత పూర్తి బీమా సౌకర్యంను ఆదివారం సాయంత్రం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) చేతుల మీదుగా ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. రవాణ ఉపశాఖ కమిషనర్ ఉప్పల శ్రీనివాస్ ఈ కార్యక్రమానికి హాజరవుతుండగా, దక్షిత ఫౌండేషన్ వారి సహకారంతో ఈ కార్యక్రమాన్ని తన ఆధ్వర్యంలో సాయంత్రం 5గంటలకు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

కిష్టంపేటలో గృహజ్యోతి సర్వే

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేటలో గృహజ్యోతి పథకంలో భాగంగా ఇంటింటికీ తిరిగి సిబ్బంది వినియోగదారుల వివరాలు సర్వే చేస్తున్నారు. విద్యుత్ వినియోగదారుల నుంచి విద్యుత్ మీటర్ నంబర్‌తో పాటు ఆధార్ కార్డ్, రేషన్ కార్డు నంబర్లను నమోదు చేస్తున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, విద్యుత్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలివ్వాలని నిరసన

- ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

చెన్నూర్: ప్రభుత్వ ఆసుపత్రులలో విధులు నిర్వర్తిస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఉద్యోగులు నిరసన తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. మూడు నెలల నుంచి వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. కొంతకాలంగా ఉద్యోగుల పీఎఫ్, ఈఎస్ఐ కట్టడం లేదన్నారు. ఉద్యోగుల మూడు నెలల వేతనాలతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ క్లియర్ చేయించాలన్నారు. కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, శానిటేషన్, సెక్యూరిటీ, పేషేంట్ కేర్ ఉద్యోగులు మహేశ్, విజయ్, సౌందర్య, కౌసల్య, వాణి, స్వరూపరాణి, సుచరిత, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి జుబేర్

నెన్నెల: విద్యార్థుల్లో రక్తహీనతను నివారించి 'అనిమియా ముక్త తెలంగాణ'గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మండల కేంద్రంలోని కస్తూరిబా విద్యార్థులకు శనివారం ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత, మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో హిమోగ్లోబిన్ రక్తపరీక్షలు నిర్వహించినట్లు ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి జుబేర్‌సాహిల్ తెలిపారు. ఈ సందర్భంగా 110మంది విద్యార్థుల నుంచి రక్తనమూనాలు సేకరించి పరీక్షలు చేయగా 8మంది విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. హిమోగ్లోబిన్ శాతం 10లోపు ఉన్న వారికి ఐరన్ మాత్రలు అందజేశారు. పౌష్టికాహారం తీసుకోవాలని అవగాహన కల్పించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే దేశం సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని డాక్టర్ అన్నారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ రుక్మిణి, ఏఎన్ఎం స్వప్న, హెచ్ఎం ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జన్నారం: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించేందుకు పనిచేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. జన్నారం మండలంలోని ఇందన్‌పల్లి, మురిమడుగు, నర్సింగపూర్, కలమడుగు, ధర్మారం, బాదంపల్లి, పుట్టిగూడ గ్రామాల్లో శనివారం 25పనులకు గాను రూ.1.01కోట్లు (రూ.1కోటి ఒక లక్ష)నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీలలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు కలిగి ఉండేలా కృషి చేస్తానన్నారు. పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని, వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో రోడ్డు సౌకర్యం, డ్రెయినేజీ సౌకర్యం కలిగి ఉన్నప్పుడు పరిశుభ్రత సాధ్యమన్నారు. 2023–24సంవత్సరానికి మంజూరైన ఈ నిధులతో పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సరోజన, ఎంపీడీవో అరుణరాణి, మాజీ ఎంపీపీ శంకరయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, పీఏసీఎస్ చైర్మన్ అల్లం రవి, డైరెక్టర్ గౌరయ్య, సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి, సయ్యద్ ఇసాక్, ఫసీఉల్లా, కరుణాకర్, నందు నాయక్, సతీశ్, బాలరాజు, శ్రీకాంత్, సాగర్‌గౌడ్, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన విద్యుత్ పునరుద్ధరణ పనులు



పనులు పరిశీలిస్తున్న ఏడీఈ స్వామి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గత నెల రోజులుగా మంచిర్యాలలో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చేపడుతున్న విద్యుత్ పునరుద్ధరణ పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. మంచిర్యాల పట్టణ ప్రజలు విద్యుత్ పనుల నిర్వహణలో భాగంగా విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు పడుతుండగా, ఈ ఇబ్బందులకు ఇప్పుడు తెర పడింది. పాతమంచిర్యాల నుంచి ఇందారం వరకు రోడ్డు విస్తరణ పనులు గతేడాదిగా సాగుతుండగా మంచిర్యాలలోని సీసీసీ నుంచి పాతమంచిర్యాల వరకు గత నెల రోజులుగా రోడ్డు వెడల్పు కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఇందులో భాగంగా రోడ్డుపై ఉన్న విద్యుత్ స్థంభాల తొలగింపు చేపట్టాల్సి ఉండగా, నూతన విద్యుత్ స్థంభాలు ఏర్పాటు అనివార్యమైంది. ఈ క్రమంలో నెల రోజులుగా పాతమంచిర్యాల నుంచి మంచిర్యాల ఓవర్ బ్రిడ్జి వరకు మొత్తం 23విద్యుత్ టవర్లు (విద్యుత్ పోల్స్) ఏర్పాటు చేసి విద్యుత్ తీగలు అమరుస్తున్నారు. రాంనగర్ సబ్‌స్టేషన్ వరకు 33, 11కేవీ విద్యుత్ తీగలు అమర్చే కార్యక్రమాలు పుంజుకున్నాయి. ఈ పనులు గత 15రోజులుగా సాగుతుండగా ఇటీవల ఈ పనులు వేగవంతంగా చేపట్టగా ఎట్టకేలకు శనివారం పనులు పూర్తి చేశారు. మంచిర్యాల విద్యుత్ ఎస్ఈ శేషారావు, డీఈ కైసర్, ఏడీఈ రేగుంట స్వామిలు పర్యవేక్షించి పనుల పూర్తికి కృషి చేశారు.

సంక్షిప్త వార్తలు

సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల నియోజకవర్గ ఆటో సోదరులకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఉచిత బీమా సౌకర్యాన్ని అందజేస్తుండగా అంతా సద్వినియోగం చేసుకోవాలని ఆటో డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు బచ్చలి మల్లేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11వ తేదీ ఆదివారం నియోజకవర్గంలోని దాదాపు 3వేల మంది ఆటో సోదరులకు లబ్ధిచేకూరే విధంగా మంచిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉచిత బీమా అందజేస్తారన్నారు.

విద్యార్థులకు అవగాహన

దండేపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు జిల్లా మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో పలు అంశాల గురించి శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. బేటీబచావో–బేటీపడావో, లింగవివక్షత, లింగసమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్‌క్రైమ్, మహిళ హెల్ప్‌లైన్, చైల్డ్ హెల్ప్‌లైన్, పోలీస్ హెల్ప్‌లైన్, ఫోక్సో చట్టం, సుకన్య సంవృద్ధి యోజన పథకాల గురించి తెలపడంతో పాటు ఆడపిల్లల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో మహిళ సాధికారక హబ్ జెండర్ మౌనిక, ఫైనాన్సియల్ లిటరసీ లిప్సిక, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వేమనపల్లి: మండలంలోని ముల్కలపేట, కేతన్‌పల్లి, వేమనపల్లి గ్రామపంచాయతీల్లో ఎంపీటీసీ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం రూ.35లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు.

ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి 'డాక్టరేట్'

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రానికి చెందిన కోయడ అన్నపూర్ణ నార్లపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా కొనసాగుతూనే సామాజిక రంగంలో ఎన్నో సేవలందించినందుకు గాను డేస్ప్రింగ్ ఇంటర్‌నేషనల్ యూనివర్సిటీ (యూఎస్ఏ) వారు గుర్తించి శనివారం సికింద్రాబాద్‌లోని అమృతవాణి కమ్యూనికేషన్ ఫంక్షన్ హాల్లో జరిగిన డాక్టరేట్ ప్రదానోత్సవ కార్యక్రమంలో డాక్టరేట్ ప్రదానం చేశారు.

రేపు ఉచిత కంటి పరీక్ష శిబిరం

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీ లక్ష్మీగణపతి శివ మార్కండేయ దుర్గామాత ఆలయం ఆవరణలో ఆలయ కమిటీ, పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12న ఉచిత కంటి పరీక్ష శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పట్టణ పద్మశాలీ సంఘం నాయకులు, ఆలయ కమిటీ నాయకులు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల:
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899